క్లుప్తంగా

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్: కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే మైనర్ విద్యార్థులు మోటారు సైకిళ్లు నడపటం నేరమని డీఎస్పీ ఈ.శ్రీనివాసులు అన్నారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో నగరంలోని పలు కళాశాలల యాజమాన్యాలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. మైనర్ బాలలు, లైసెన్సులు లేని విద్యార్థులు కళాశాలలకు మోటారు సైకిల్‌పై రాకూడదన్నారు. విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని కోరారు. 16 సంవత్సరాలు నుంచి మైనార్టీ తీరేవరకు మోటారు సైకిళ్ళను వినియోగించకూడదన్నారు. మైనార్టీ తీరేవరకు గేరు లేని వాహనాలు నడిపేందుకు లైసెన్స్ తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. మోటారు సైకిల్‌పై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో రోడ్లపై స్టూడెంట్ జోన్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని డీఎస్పీ సూచించారు.

బీసీ చైతన్య సమితి ఉపాధ్యక్షుడిగా రాయుడు



ఏలూరు (టూటౌన్): బీసీ చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏలూరుకు చెందిన చల్లా రాయుడు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు ఆదేశాల మేరకు రాయుడును నియమిచ్చినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ తెలిపారు.

పీఎం విశ్వకర్మ యోజనపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న అధ్యక్షుడు విక్రమ్ కిషోర్

ఏలూరు (టూటౌన్): పీఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ కోరారు. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ ఏలూరు జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న జంగారెడ్డిగూడెంలో నిర్వహించే బూత్ స్వశక్తీకరణ సమావేశంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి జిల్లా పర్యటన విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గారపాటి సీతారామాంజనేయు చౌదరి, అంబికా కృష్ణ, శరణాల మాలతీరాణి, కట్నేని కృష్ణ ప్రసాద్, ఐ.చక్రవర్తి వర్మ, కె.సుధాకర్ కృష్ణ,నడపన దాన భాస్కరరావు, నగరపాటి సత్యనారాయణ, కట్టా సత్యనారాయణ, గాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు అర్జీలకు తక్షణ పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



హాజరైన అధికారులు, సచివాలయ ఉద్యోగులు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో సత్వరమే పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. గురువారం ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గడపగడపకు

7వ డివిజన్‌లో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే నాని

అర్జీలపై ఆయన అధికారులతో సమీక్షించారు. వన్‌టౌన్ 7వ డివిజన్ 55వ సచివాలయం పరిధిలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై అర్జీల వచ్చినట్లు చెప్పారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 7వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు రూ.50 లక్షలతో రూపొందించిన ప్రతిపాదనలను ఆమోదించామన్నారు. నగరంలో స్థానిక సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళుతున్నట్టు చెప్పారు. సమీక్షలో రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, డిప్యూటీ మేయర్ ఎన్ సుధీర్‌బాబు, అదనపు కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఎంహెచ్ఓ మాలతీ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

త్రీ టౌన్ ఎస్సైగా మదీనా బాషా



సీఐ శివాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై మదీనా బాషా

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా మదీనా బాషా నియమితులయ్యారు. ఎస్పీ డి.మేరిప్రశాంతి ఆదేశాల మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మదీనాబాషా ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేశారు. ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి మరోసారి త్రీటౌన్‌కు ఎస్సైగా వచ్చారు.

విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు



ఏలూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన శ్రీనివాసరావు, సుధీర్‌బాబు



45వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన మైబాబు, స్రవంతి

ఏలూరు టౌన్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లోని విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పలు డివిజన్లల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. 33, 37, 38 డివిజన్లకు సంబంధించి 29, 30 సచివాలయాల పరిధిలో జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమం డిప్యూటీ మేయర్లు శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యురాలు తాయారు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను బోర్డును ప్రారంభించారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉన్నత విద్య, నాణ్యమైన వైద్యసేవలను, చికిత్సలను అందుబాటులోకి తెచ్చారని వివరించారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలు తీసుకున్నారని విమర్శించారు. పేదలకు ఇంగ్లీష్ విద్యతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తోట శివ, లబ్ధిదారులున్నారు.

45వ డివిజన్‌లోని గస్‌బజార్ సచివాలయం-2 పరిధిలో క్లస్టర్-3 అధ్యక్షుడు మంచెం మైబాబు, మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, యువజన విభాగ అధ్యక్షుడు ఈదుపల్లి పవన్, కార్పొరేటర్ ఇలియాస్ పాషా ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్‌జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. డివిజన్‌లో లబ్ధిదారులతో కలిసి సంక్షేమ బోర్డును ప్రారంభించారు. గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేశారని తెలిపారు. 104 సంచార వైద్యశాల ద్వారా ప్రతి నెలా రెండుసార్లు గ్రామాలకెళ్లి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు.

పంట నష్టం అంచనాల్లో అధికారులు



వెంకటాపురంలో పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్



చాటపర్రులో నీట మునిగిన వరి పనలు

ఏలూరు రూరల్: ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు తుపాను పంట నష్టాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. చేలల్లో ముంపునీటి పారుదలకు చర్యలు చేపట్టారు. తుపాను నష్టంపై ఏలూరు మండల ప్రత్యేక అధికారిణి, ఐసీడీఎస్ పీడీ పద్మని సమక్షంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, రూరల్ తహసీల్దార్ జె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.ప్రణవి, మండల వ్యవసాయ అధికారిని జీవనసంధ్య, రైతు భరోసా కేంద్రం సిబ్బంది సమీక్షించారు. ఈ ఏడాది ఏలూరు అర్బన్ ప్రాంతాలకు చెందిన పోణంగి, కొమడవోలు, శనివారపుపేట, వెంకటాపురం, సత్రంపాడు, చొదిమెళ్ల, తంగెళ్లమూడి ప్రాంతాల్లో 3122.4 ఎకరాల్లో వరిసాగు చేయగా, ఇందులో 296 ఎకరాల్లో పంట నీట మునిగిందని, 824.06 ఎకరాల్లో పంట నేల కొరిగిందని గుర్తించారు. తుపానుకు ముందు 168.05 ఎకరాల్లో పంటను మాత్రమే మిల్లులకు తరలించినట్టు పేర్కొన్నారు. ఏలూరు రూరల్ గ్రామాలైన మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, బూబూఖాన్‌గూడెం, తిమ్మారావుగూడెం, మల్కాపురంలో 3658.74 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో 701 ఎకరాల్లో పంట నేలకొరగా, మరో 520 ఎకరాల్లో పంట నీట మునిగినట్టు గుర్తించారు. ఇందులో అత్యధికంగా పంట పనలపై ఉందని, ఇప్పటి వరకు 462 ఎకరాల్లో మాత్రమే పంట ఒబ్బిడయినట్టు నిర్ధారించారు. చాటపర్రులో నాలుగెకరాల్లో పంట నీటి మునిగినట్టు పేర్కొన్నారు. వెంకటాపురం సుంరకవారితోట రైతు తలారి కొండబాబు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ బి.సోమశేఖర్ కాలువకు అడ్డంకులు తొలిగింపజేశారు. చేపల చెరువుల గట్లు కారణంగా చాటపర్రు, జాలిపూడి పరిసరాల్లో పంటచేలల్లో మురుగునీరు కింద పారడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ.40 లక్షలతో రోడ్ల నిర్మాణం



16వ డివిజన్‌లో రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ విజయనిర్మల, నాయకులు రమేష్

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్లల్లో ప్రజల నుంచి, పార్టీ నేతల వినతుల మేరకు రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, వీధిదీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వన్‌టౌన్ 16వ డివిజన్‌లో 43వ సచివాలయం పరిధిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే మూడు రోడ్లు నిర్మించగా, గురువారం మరో సీసీ రోడ్డు నిర్మించారు. పడమరవీధి చేపల చెట్టు రోడ్డు, చాకలిదిబ్బ రోడ్డు, గంగానమ్మ స్కూల్ ఎదురు రోడ్డు కొత్తగా నిర్మించారు. కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల పార్టీ యువజన నాయకులు జిజ్జువరపు రమేష్ పర్యవేక్షణలో రోడ్డు నిర్మించారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం చేయడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐటీయూసీ సభను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు కోరారు. కట్టా సుబ్బారావు తోటలో ఉన్న సర్వీస్ రిజర్వాయర్ వద్ద గురువారం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఎ.అప్పలరాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్లను తీసుకొచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు డి.వెంకటేశ్వరరావు, జె.రవి, డి.దుర్గాప్రసాద్, జె.పవన్ కుమార్, జి.ప్రసాద్, సీహెచ్ అమర్నాథ్, ఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు రూరల్ : తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. బుధవారం ఆయన ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. ఎకరానికి రూ.40 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రామకృష్ణ కోరారు. ఆయన వెంట సీపీఐ జాతీయ కార్యదర్శి సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జి.ఈశ్వరయ్య, డేగా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

- ఏలూరు రూరల్ గ్రామం మాదేపల్లిలో నేలకొరిగిన పంటచేలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎకరానికి రూ.20 వేలు నష్టపరిహారంతో పాటు పంట బీమా వర్తింపుజేయాలని కోరారు.

వృద్ధుడి మృతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన వృద్ధుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన పంపన ఆంజనేయులు (70) గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకెళ్లి పురుగు మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని తొలుత తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన పై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వర్జీనియా తోటల్లో ఇసుక మేటలు



కొయ్యలగూడెం: మంగపతిదేవిపాలెం వద్ద వర్జీనియా తోటలలో వేసిన ఇసుక మేటలు



బుట్టాయగూడెం: కామయ్యపాలెంలో ఇసుక మేట వేసిన వేరుశనగ పంటను పరిశీలన

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావం రైతులపై తీవ్ర ప్రభావం చూపించింది. ముఖ్యంగా వర్జీనియా పొగాకు తోటలకు భారీ నష్టాన్ని మిగిల్చింది. పొగాకు తోటలలో వరద ప్రవహించడం వల్ల ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.75 వేల నుంచి లక్ష పెట్టుబడి పెట్టామని, వర్షంతో వచ్చిన వరదల వల్ల చేలలోని ఇసుక మేటలను తొలగించడానికి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని రైతు ఊసా దామోదరం వాపోయాడు. మళ్లీ తోటలు వేసినా అదును ప్రభావం దాటిపోతుందని, దీంతో నాణ్యమైన పొగాకు దిగుబడి సాధ్యం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజవరం పంచాయతీ పరిధిలో అదేవిధంగా కన్నాపురం, దిప్పకాయలపాడు పంచాయతీల్లోని పొగాకు తోటలలో ఇసుక మేటలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని వారు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

బుట్టాయగూడెం: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఏజెన్సీ మెట్టప్రాంతాల్లోని వర్జీనియా పొగాకు, వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వర్షానికి పొగాకు, మినుము, వేరుశనగ పంటల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరింది. ఈదురు గాలులు కూడా భారీగా వీయడంతో పలుచోట్ల పొగాకు, వేరుశనగ పంటలపై వరదనీరు ముంచెత్తడంతో ఇసుక మేట్లు వేశాయి. రైతులు ఇసుక మేట్లతో ఉన్న పంటలను చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాగా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో సుమారు 1137 ఎకరాల్లో మొక్కజొన్న, 2064 ఎకరాల్లో పొగాకు, 1515 ఎకరాల్లో ప్రత్తి, 76 ఎకరాల్లో మినుము, 413 ఎకరాల్లో వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులు పంపిస్తామని చెబుతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.15	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	48	కంద	60
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	44
కాకర కాయలు	32-40	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	54	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	46	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	50-55	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	38	బఠాణి	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	34

మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండాలి



బ్రాహ్మణ చెరువు వద్ద మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

పెదపాడు: మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు గ్రామంలోని బ్రాహ్మణ చెరువు వద్ద ఉన్న మంచినీటి ట్యాంకు పైకి ఎక్కి ట్యాంకులో నీటిని ఎంపీడీఓ సూర్యకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పీఎస్ఆర్‌వీఎస్ఎస్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ నిబంధనల మేరకు ప్రతి 15 రోజుల కోసారి ట్యాంకును పరిశుభ్రం చేయాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ప్రజలకు అందించాలన్నారు. పరిశుభ్రమైన నీరు ప్రజలకు అందించడం వల్ల ప్రజలు ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు పంచాయతీ కార్యదర్శి దాకారపు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను వేగంతో స్పందన

భీమడోలు: తుపాను ప్రభావం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పోలసానిపల్లి గ్రామంలోని పలు వార్డులకు రెండు రోజులుగా తాగునీటి సమస్య తలెత్తింది. దీనిపై స్పందించిన సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా గురువారం గ్రామంలోని 10, 11, 12 వార్డులోని ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అనంతరం బీసీ కాలనీలోని పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి, విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీనితో మంచినీటి సమస్యను పరిష్కరించారు. అదే విధంగా గ్రామానికి చెందిన పలు రైతులకు చెందిన ధాన్యం రాసులు తడిచిపోయాయి. దీనితో మొలకెత్తిన గింజలను పరిశీలించిన సర్పంచ్ సమస్యలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకుని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతి రోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సివిల్ కేసుల్లో కోర్టుకు కట్టిన ఫీజును కూడా తిరిగి తీసుకోవచ్చునన్నారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

పోలవరం రూరల్: యువత విద్యతో పాటు ఆటల్లో కూడా ప్రతిభ సాధించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న నూతనంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా కిట్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండలంలోని 15 పంచాయతీలకు ఈ కిట్‌లను అందజేశారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో సీహెచ్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.